వివాదాస్పదంగా గోడం నగేశ్ నామినేషన్

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిపై ఎన్నికల సంఘానికి బీఎస్పీ అభ్యర్థి ఫిర్యాదు
- భార్య ఆస్తుల వివరాల వెల్లడించలేదని ఆరోపణ
- రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆందోళన

ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్‌లో వివరాలు సరిగా లేవంటూ విలేకరులకు తెలియజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి జంగుబాపు

ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్ వివాదాస్పదంగా మారింది. నగేశ్ నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలు వెల్లడించలేదంటూ బీఎస్పీ అభ్యర్థి ట్విట్టర్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ నాయకులు రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. మొత్తం 23 మంది అభ్యర్థులు 42 సెట్ల నామినేషన్ పత్రాలు వేశారు. శుక్రవారం రిటర్నింగ్ అధికారి, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఇతర అధికారులు పరిశీలన చేపట్టారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు నామినేషన్ల స్క్రూటీనికి హాజరయ్యారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ తన నామినేషన్ అఫిడవిట్‌లో ఆయన భార్యకు సంబంధించిన ఆస్తులు వివరాలు వెల్లడించలేదని పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. పరిశీలనలో భాగంగా నగేశ్ భార్య ఆస్తుల వివరాల వెల్లడి విషయంలో రిటర్నింగ్ అధికారి అభ్యంతరాలను పట్టించుకోకుండా నామినేషన్‌ను అంగీకరించారంటూ బీఎస్పీ అభ్యర్థి జంగుబాపు ట్విట్టర్లో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్ సరిగా లేదంటూ తాము చేసిన అభ్యంతరాలను రిటర్నింగ్ అధికారి పట్టించుకోకుండా ఆమోదించారని ఆయన అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ అధికారులు సైతం ఆందోళనకు దిగారు. నగేశ్ నామినేషన్ తిరస్కరించాలంటూ రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒత్తిడి మేరకు అధికారులు నగేశ్ నామినేషన్‌ను తిరస్కరించకుండా ఆమోదించారని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్ రిజక్ట్ చేయాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ముథోల్, ఏప్రిల్ 26 : ముథోల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు లోలం శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 26 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రత్న ప్రభ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా నాయకుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పదేళ్ల మోదీ పాలనలో కార్మికులు, వ్యవసాయదారులు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు కొమ్ముకాస్తున్నదని ఆరోపించారు. దేశంలో అన్నిరకాల ధరలు పెరిగాయని సంపద మాత్రం పెరుగలేదని పేర్కొన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న కేంద్రం పేద ప్రజల బాధను పట్టించుకోవడం లేదని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదని గ్రామాలకు వచ్చిన ఈ పార్టీ నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలంటే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తిరుపతి, నర్సయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

ఖానాపూర్ : బాదనకుర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్, ఏప్రిల్ 26: బాదనకుర్తి చెక్‌పోస్టు వద్ద అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జిల్లాలోకి వచ్చే వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి మదన్‌మోహన్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు పైగా నగదును కలిగి ఉండరాదని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 26 : సిరికొండలోని ఎస్ఐ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరు కూడా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బోథ్, ఏప్రిల్ 26: సోనాల-మహారాష్ట్ర రోడ్డుపై శుక్రవారం సాయంత్రం ఎస్ఐ రాము ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికలు జరిగిన సందర్భంలో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరు కూడా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లోద్దని సూచించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పనులను పూర్తి చేయాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 26 : అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని రేవోజిపేట, మున్యాల, బుట్టాపూర్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఏఈ లవకుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. పనుల ప్రారంభంపై ఉపాధ్యాయులతో చర్చించారు. పనులు ఎలా చేయాలో వివరించారు. వేసవి కాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీవో లీడర్ ఉన్నారు.

బోథ్ : మాట్లాడుతున్న ఎంపీపీ తుల శ్రీనివాస్



ఇచ్చోడ: మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి

బీఆర్ఎస్ అంటే ప్రజలకు భరోసా

- ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసిన నాయకులు, కార్యకర్తలు

ఇచ్చోడ, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ అంటేనే ప్రజలకు సంపూర్ణ భరోసా అని పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని బోరిగామ, కామగిరి గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగ్, సుభాష్, రమేశ్, మహేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ మండలంలో..

బోథ్, ఏప్రిల్ 26 : పట్నాపూర్, మర్లిపెల్లి, బాబెర, చింతగూడ, గురుదేవ్ నగర్, ఇంకర్‌పెల్లి, మేడిగూడ గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాలుగు నెలల పాలనకే కేసీఆర్ గుర్తుకొస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు నాడు తమల్ని బతికించాయని ప్రజలు స్వయంగా తెలియజేస్తున్నారన్నారు. కేసీఆర్ కష్టాలు కడతేర్చితే, కాంగ్రెస్ కష్టాలను కండ్ల ముందు పెడుతున్నదన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పంద్రం సుగణ శంకర్, కొమ్ము చంద్రమోహన్, బాబుసింగ్, దేవేందర్, సురేశ్, భూమన్న, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ రాయలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రుక్మాణ్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిహత్నూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్కాపూర్, గర్కంపేట్ గ్రామాల్లో..

గుడిహత్నూర్, ఏప్రిల్ 26 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపును కోరుతూ మల్కాపూర్, గర్కంపేట్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు బేర దేవన్న, సంతోష్‌గౌడ్, జాదవ్ భీంరావ్, వెంకట్‌రావ్, పాటిల్ రాందాస్ పాల్గొన్నారు.

సుంగపూర్, చోర్‌గావ్ గ్రామాల్లో ..

నార్నూర్, ఏప్రిల్ 26 : సుంగపూర్, చోర్‌గావ్ గ్రామాల్లో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖానీం, మాజీ సర్పంచ్ కనక ప్రభాకర్, ఆత్రం అనసూయబాయి, పుసం రాము పాల్గొన్నారు.

కోల్హారిలో ..

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 26: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా కోల్హారి గ్రామంలో పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మడిగే రమేశ్, సాయన్న, రియాజ్, వినోద్, ముధు, జ్ఞానేశ్వర్, రమణ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 26 : తలమడుగు మండలం కొత్తూరు గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే పట్టం కట్టండి

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 26 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మండల కన్వీనర్ కల్చప్ యాదవ్ అన్నారు. గోమూత్రి గ్రామంలో నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అలాగే తాంసి మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, నాయకులు కీర్తి అరుణ్‌కుమార్, వెంకటరమణ, అండె అశోక్ పాల్గొన్నారు.



నార్నూర్ : చోర్‌గావ్‌లో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బజార్‌హత్నూర్ : కోల్హారిలో ..

తాంసి: కొత్తూరులో ..

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 26 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్న ఓటర్ స్లిప్పుల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు వేసే హక్కు కల్పించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో యువతీ యువకులందరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో గుడిహత్నూర్ ఎంపీడీవో అబ్దుల్, ఈవో సూర్యప్రకాశ్, బీఎల్‌వోలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు

రైళ్లలో పోలీసుల తనిఖీలు

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 26 : తలమడుగు మండలం కోసాయి గ్రామంలోని రైల్వే స్టేషన్‌లో ఆగిన ప్యాసింజర్ రైలులో శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధనశ్రీ మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం, దేశీదారు జిల్లాలోకి ప్రవేశించకుండా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టామని, ఎవరైనా రూ.50 వేలకు మించి నగదును తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట పోలీస్ అధికారులు ఉన్నారు.

రైలులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ ధనశ్రీ

రాష్ట్ర సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

కరపత్రాలు విడుదల చేస్తున్న కవులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 26 :వరంగల్‌లో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన సమూమ సెక్యులర్ రైటర్స్ ఫోరం నిర్వహిస్తున్న లౌకిక విలువలు సాహిత్యం అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ రచయితల వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు తెలిపారు. శుక్రవారం నిర్మల్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు హన్మంతు, ప్రధానకార్యదర్శి వెంకట్, అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, కామారపు జగదీశ్వర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 26 : నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేసిన కే అజేశ్‌కుమార్ బదిలీ కాగా శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా జడ్జి కర్ణకుమార్ మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జిగా అజేశ్‌కుమార్ అత్యుత్తమ సేవలందించారన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోగినిపల్లి భవిష్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, కోశాధికారి నర్సారెడ్డి, వంశీ, సీనియర్ న్యాయవాదులు శుభకరన్, గోవర్ధన్, గంగాధర్, కొమ్మాజి రమణ, రాజు పాల్గొన్నారు.

అల్లాడుతున్న పశువులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 26 : నిర్మల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రెండు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఎండలకు తోడు వడగాల్పులు వీయడంతో పశువులు అల్లాడి పోతున్నాయి. ప్రతి రోజూ పశువులను మేత మేపడానికి వెళ్తున్న కాపారులు, పశుపోషణ దారులు ఎండల కారణంగా పగటి వేళలో పశువులను చెరువుల్లో, వాగుల్లో నీరు తాగిన తర్వాత చెట్ల కింద సేద తీరుస్తున్నారు.

చెట్లకింద సేదతీరుతున్న పశువులు

దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం, ఏప్రిల్ 26 : దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ హైదరాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు గాను పదో తరగతి పూర్తయిన అనాథ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, నిర్మల్ జిల్లా సంక్షేమ అధికారిణి నాగమణి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పాక్షిక అనాథలు (తండ్రి, లేదా తల్లి చనిపోయిన వారు), నిర్లక్ష్యం చేయబడ్డ పిల్లలు, మాతా శిశు సంక్షేమ శాఖ ద్వారా నడుపబడుతున్న పిల్లల గృహాలో ఉండే పిల్లలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న, అక్రమ రవాణా బాధితులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టీఎస్ పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్ష రాయనున్న పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, 60 సీట్లు, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, 60 సీట్లు, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 60 సీట్లు, ఉన్నాయన్నారు. దరఖాస్తులను మే 20వ తేదీ లోపు కమిషనర్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఇ.నెం.8-3-22 మధురానగర్, సారథి స్టూడియో దగ్గర, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, హైదరాబాద్ వారికి, లేదా బాలరక్ష భవన్ కార్యాలయం గొల్లపేట, నిర్మల్ నందు,ఆదిలాబాద్‌లోని విద్యానగర్ బాలరక్షక్ భవనంలోని డీసీపీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

జైనథ్, ఏప్రిల్ 26 : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం కేదార్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామిని ప్రత్యేక హారతులతో కొలిచి వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. హోమాది క్రతువుల్లో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వేడుకల వివరాలను ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ హనుమాన్ ఆలయ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షలు కేటాయించామని గుర్తు చేశారు. ఆలయాల నిర్మాణాలు, అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

పాలనలో కాంగ్రెస్ పార్టీ విఫలం

కుంటాల, ఏప్రిల్ 26 : మండలంలోని విట్టాపూర్, పెంచికల్‌పాడ్, వెంకూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యురాలు పడకంటి రమాదేవి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఓటును అభ్యర్థించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు ముగిసినప్పటికీ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోయిందని, కరెంట్ కోతలతో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు అవుతున్నాయని, పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పెంటవార్ దశరథ్, రాకేశ్, ఉమ్రి శ్రీధర్, మోహన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

గుమ్ముల జస్వంత్(ఫైల్)

బోథ్, ఏప్రిల్ 26 : బోథ్‌కు చెందిన గుమ్ముల జస్వంత్(19) అనే యువకుడు ప్రభుత్వ ఉద్యోగం రావడం లేదని మనస్తాపం చెంది గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..

ఆడెపు ప్రవీణ్(ఫైల్)

బోథ్, ఏప్రిల్ 26 : మండల కేంద్రానికి చెందిన ఆడెపు ప్రవీణ్ (35) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాము తెలిపారు. బతుకు దేరువు కోసం దుబాయ్‌కి వెళ్లిన ప్రవీణ్ నాలుగు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో గురువారం సాయంత్రం తన ఇంట్లో ప్యాంటుతో ఉరేసుకున్నాడు. ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు పట్టివేత

సారంగాపూర్, ఏప్రిల్ 26 : చించోలి(బీ) చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్ఐ చంద్రమోహన్ వాహనాల తనిఖీ చేపట్టారు. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ గుండా వచ్చే వాహనాలను తనిఖీ చేయగా బోరిగాం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద రూ. 1.90లక్షల నగదు పట్టుకున్నారు. పట్టుకున్న డబ్బులకు సరియైన పత్రాలు లేనందున నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి పంపించి ప్రత్యేకాధికారికి డిపాజిట్ చేశామని తెలిపారు.

జైనథ్, ఏప్రిల్ 26 : బేల మండలం శంకర్‌గూడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.93 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ రాధిక తెలిపారు. శుక్రవారం మహారాష్ట్ర నుంచి చంద్రాపూర్ మీదుగా నాందేవ్ వైపు వెళ్తున్న కారును తనిఖీ చేయగా నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో కారును అదుపులోకి తీసుకున్నారు. కారు యజమాని గురువే సుంటకేపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ డబ్బును ఎస్ఎఫ్‌టీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

జైనథ్, ఏప్రిల్ 26 : పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్షా 80 వేల నగదు పట్టుకున్నట్లు జైనథ్ సీఐ డీ సాయినాథ్ తెలిపారు. శుక్రవారం అమిత్ సుధాకర్ తన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ఎలాంటి రసీదులు లేని రూ.లక్ష, రిషి అనే వ్యక్తి తన కారులో హైదరాబాద్ వెళ్తుండగా ఎలాంటి రసీదులు లేని రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు. నగదును సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

ఇచ్చోడ, ఏప్రిల్ 26 : సల్యాద గ్రామ పంచాయతీ పరిధిలోని యాపల్‌గూడలో రైతు నందు కుమార్‌కు చెందిన ఎద్దు శుక్రవారం వ్యవసాయ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉండడంతో మేస్తూ వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన క